సాక్షి
పార్వతీపురం మన్యం

మంగళవారం । 7 । మే । 2024



ల్యాండ్ టైట్లింగ్ రాద్ధాంతం

పాకిస్తాన్ తీవ్రవాదుల కంటే దారుణంగావ్యవహరిస్తున్న టీడీపీ అధినేత చంద్రబాబు వ్యవహార శైలిపై అన్ని వర్గాల ప్రజలు మండిపడుతున్నారు.

- 8లో



వారంతా వైఎస్సార్‌సీపీలోనే ఉన్నారు

వీరఘట్టం మండలంలోని పనసనందివాడలో పొగపెట్టాలని చూసిన గ్రామానికి చెందిన దొంగ నాయుళ్ల ఆటలు ఇకసాగవని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ హెచ్చరించారు.

- 8లో



భారీ వర్షం

భామిని: మండలంలో ఈదురుగాలులతో కూడిన వర్షం పడడంతో సోమవారం జన జీవనం స్తంభించింది.

- 8లో

న్యూస్‌రీల్

ఇతర జిల్లాల ఉద్యోగులకు నేడు, రేపు అవకాశం

పార్వతీపురం: ఇతర జిల్లాల్లో ఓటు హక్కు కలిగి పార్వతీపురం మన్యం జిల్లాలో పనిచేస్తున్న ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని రెండు రోజుల పాటు పొడిగించినట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిషాంత్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగులకు మే 5, 6 తేదీల్లో శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రంలో పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించిందన్నారు. పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకున్న 5,6 తేదీల్లో ఓటు హక్కు వినియోగించుకోలేని వారి అభ్యర్థన మేరకు గడువును మరో రెండు రోజులు పెంచినట్లు పేర్కొన్నారు. పోస్టల్ బ్యాలెట్‌కు గతంలో దరఖాస్తులు సమర్పించిన ఇతర జిల్లాలకు చెందిన అందరు ఉద్యోగులు శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రంలో 7,8 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

వ్యయ రిజిస్టర్ల పరిశీలన



రికార్డులు పరిశీలిస్తున్న వ్యయ పరిశీలకుడు

సీతంపేట: సాధారణ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల వ్యయ రిజిస్టర్లను పాలకొండ అసెంబ్లీ నియోజకవర్గ వ్యయ పరిశీలకుడు రమాకాంత్ ప్రధాన్ సోమవారం పరిశీలించారు. ఈ మేరకు స్థానిక ఐటీడీఏలో గల రిటర్నింగ్ ఆఫీసర్ కార్యాలయంలో వాటిని పరిశీలించి రాజకీయ పార్టీల ప్రతినిధులకు పలు సూచనలిచ్చారు. వ్యయ రిజిస్టర్‌లో అభ్యర్థి ఖర్చుల వివరాలు పక్కాగా నమోదు చేయాలని చెప్పారు. ఈనెల 11వ తేదీన మరోమారు రిజిస్టర్ల పరిశీలన ఉంటుందని, ఆ రోజు తప్పనిసరిగా ఖర్చుల వివరాలు పరిశీలన చేయించుకోవాలని అభ్యర్థులకు సూచించారు. కార్యక్రమంలో వివిధ పార్టీల ప్రతినిధులతో పాటు వ్యయపరిశీలన బృందాలు పాల్గొన్నాయి.

ఓటర్లకు గమనిక

- బీప్ సౌండ్ వస్తేనే ఓటు పడినట్లు

పార్వతీపురం: పోలింగ్ బూత్‌లో ఈవీఎం బటన్ నొక్కినపుడు బీప్ శబ్దాన్ని ఓటర్లు గమనించాలి. శబ్దం రాకుంటే ఓటు దుర్వినియోగం అయినట్లుగా భావించవచ్చు. ఓటర్లు ఈవీఎం శబ్దంపై దృష్టి కేంద్రీకరించి అనుమానం ఉంటే అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలి. పోలింగ్ బూత్‌లో ఉన్న ఒక అధికారి వద్ద ఈవీఎం మాస్ కంట్రోల్ యూనిట్ ఉంటుంది. అది నొక్కినప్పుడే ఈవీఎం యాక్టివేట్ అవుతుంది. యాక్టివేట్ అయిన తరువాత ఓటరు పరదా చాటున ఈవీఎంలో నచ్చిన అభ్యర్థికి ఓటు వేయాలి. బటన్ నొక్కినపుడు ఒక శబ్దం వస్తుంది. వెంటనే పక్కనే ఉన్న వీవీప్యాట్‌లో ఓటు వేసిన అభ్యర్థి పేరు, పార్టీ వివరాలు కనిపిస్తాయి. బటన్ నొక్కినపుడు శబ్దం రాకపోతే ఓటు పడలేదని అర్థం. ఓటర్లు ఈ విషయాన్ని గమనించాలి.

ఘాట్ రోడ్లలో భారీ వాహనాల రాకపోకలు నిషేధం

- ఈనెల 10 నుంచి 14 వరకు అమలు
- జిల్లా ఎన్నికల అధికారి విజయసునీత

సాక్షి,పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): జిల్లాలోని ఘాట్ రోడ్లలో ఈనెల 10 నుంచి 14వ తేదీ వరకు భారీ వాహనాల రాకపోకలను నిషేధిస్తున్నట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.విజయసునీత సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 13న సార్వత్రిక ఎన్నికల పోలింగ్ దృష్ట్యా సిబ్బంది, సామగ్రిని తరలించేందుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రెవెన్యూ, పోలీసు, ఆర్‌అండ్‌బీ శాఖలు ముందస్తు చర్యలు చేపట్టినట్టు ఆమె పేర్కొన్నారు. విజయనగరం జిల్లాలోని బొడ్డవర నుంచి అనంతగిరి, రకులోయ మీదుగా పాడేరు జాతీయ రహదారి, వడ్డాది-పాడేరు ఘాట్‌రోడ్డు, లంబసింగి, మారేడుమిల్లి-భద్రాచలం ఘాట్‌రోడ్ల మార్గాల్లో భారీ వాహనాల రాకపోకలపై నిషేధం ఉంటుందన్నారు. ఈ రోడ్లపై భారీ వాహనాలు, మల్టీ ఎక్సెల్ సిమెంట్, స్టీల్ రవాణా చేసే వాహనాల రాకపోకలను ఆయా తేదీల్లో నిషేధిస్తున్నామని తెలిపారు. వాహనదారులంతా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్ విజయసునీత సూచించారు.

జగనన్నకే జై

రామభద్రపురం: విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్ మెంట్, విద్యాకానుక, అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతిదీవెన, విదేశీ విద్యాదీవెన వంటి పథకాలు అమలుచేస్తున్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పక్షాన యువత నిలబడుతోంది. విద్యార్థులకు మేలుచేసే సీఎంకు జై కొడుతోంది.

చాలు బాబూ చాలు..!

అధికారమే పరమావధిగా ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు ఎన్ని అడ్డదారులైనా తొక్కుతాడు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా ఉచిత బియ్యం, పెన్షన్ వంటి కనీసం ఎనిమిది పథకాలు తప్పనిసరిగా అమలు చేయాలి. వాటికి తోడు తెలుగుదేశం పార్టీ కూటమి సూపర్ సిక్స్ అని చెప్పుకుంటున్న పథకాల కోసం ఏడాదికి మరో రూ.75 వేల కోట్లు ఖర్చవుతుంది. ఇవన్నీ కలిపితే ఏడాదికి సుమారు రూ.1,65,000 కోట్లు అవుతుంది. ఈ మొత్తం చంద్రబాబు అప్పు చేయకుండా ఎక్కడి నుంచి తీసుకువస్తాడు. నగదు బదిలీ ద్వారా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏడాదికి సుమారు రూ.60 వేల కోట్లు ఖర్చు పెడితేనే..రాష్ట్రాన్ని శ్రీలంక, వెనిజులాలా చేస్తున్నారని నిందలు వేసిన చంద్రబాబు..లక్షా 60 వేల కోట్లతో ఏం చేయాలనుకుంటున్నాడు. అప్పుడు సోమాలియా, శ్రీలంక అయిపోదా? చంద్రబాబు చెప్పేవన్నీ బూటకపు, మోసపూరిత హామీలని ఉప ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ సాలూరు నియోజకవర్గం అభ్యర్థి పీడిక రాజన్నదొర ధ్వజమెత్తారు. ఈ మేరకు 'సాక్షి'తో ముఖాముఖిలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గం అభివృద్ధికి గడిచిన ఐదేళ్లలో తీసుకున్న చర్యలు..ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ, కూటమి చేస్తున్న విష ప్రచారంపై పలు విషయాలను ఆయన వివరించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే.. –సాక్షి, పార్వతీపురం మన్యం



సాక్షి ఇంటర్వ్యూ

- అమలు సాధ్యం కాని సూపర్ సిక్స్
- ఉద్యోగులూ..విజ్ఞతతో ఆలోచించండి
- జగన్ ప్రభుత్వం చేసేదే చెప్పింది.. చెప్పిందే చేసింది
- మరింత ప్రజారంజకంగా నవరత్నాలు ప్లస్ మేనిఫెస్టో
- వైఎస్సార్‌సీపీ సాలూరు అభ్యర్థి పీడిక రాజన్నదొర

99 శాతం ఎన్నికల హామీల అమలు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేసింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల వారే ఎక్కువ మంది సంక్షేమ పథకాల లబ్ధిదారులు. వారి అవసరాలన్నీ గత ఐదేళ్లలో తీర్చాం. అన్ని వర్గాలకూ మేలు కలిగింది. అందుకే ఈ ప్రభుత్వం పట్ల వారంతా ఆనందంగా ఉన్నారు. ఇప్పుడు నవరత్నాలు ప్లస్ పేరిట మరింత సంక్షేమాన్ని ప్రజలకు చేరువ చేస్తున్నాం. అమ్మ ఒడి పథకం పరిమితిని రూ.17 వేలకు పెంచడం, వైఎస్సార్ చేయూత రెట్టింపు, చిరుద్యోగులకు రూ.25 వేల వరకూ ప్రభుత్వ పథకాల లబ్ధికి పరిమితి వంటివి ఉన్నాయి. జగన్ అయితేనే ఇస్తాడు.. పెంచుతాడన్న నమ్మకం ప్రజల్లో బలంగా ఉంది.

సూపర్ సిక్స్ కాదు..అన్నీ మోసాలే

చంద్రబాబు కూటమి చెప్పుకుంటున్న సూపర్‌సిక్స్ పథకాలన్నీ అసాధ్యమైనవి, మోసపూరితమైనవే. 2014 ఎన్నికల సమయంలో చంద్రబాబు మేనిఫెస్టో ఎంతవరకు అమలైందో అందరికీ తెలుసు. డ్వాక్రా రుణాలను ఎగ్గొట్టేశాడు. ఆడపిల్ల పుడితే మహాలక్ష్మి పథకం కోసం నగ దు డిపాజిట్ చేస్తామన్నా డు. అదీ ఎగ్గొట్టేశాడు. ఇప్పుడు చేస్తాడని నమ్మకం ఉందా? వారు చెప్పిన పథకాలన్నీ అమలు చేయాలంటే ఏడాదికి సుమారుగా రూ.1,65,000 కోట్లు అవుతుంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అందరికీ తెలిసిందే. ఎక్కడి నుంచి ఆ డబ్బులు తెస్తాడు. 14 ఏళ్ల ముఖ్య మంత్రిగా చంద్రబాబు ఏం చేశాడు. ఎంత సంపద సృష్టించాడు. రెవెన్యూలోటుతోనే మాకు అప్పగించాడు. మళ్లీ అధికారంలోకి వస్తే అంత అప్పులు చే సి ఈ రాష్ట్రాన్ని ఎలా అభివృద్ధి బాటలో నడపగలడు.

మళ్లీ అధికారంలోకి వస్తాం.. అన్నీ చేస్తాం

వంద పడకల ఆస్పత్రి, గిరిజన యూనివర్సిటీ, ప్రాథమిక ఆస్పత్రి, కొన్ని ఇరిగేషన్ ప్రాజెక్టుల ఆధునికీకరణ పనులు చాలా వరకూ పనులు తుదిదశకు చేరుకున్నాయి. మళ్లీ అధికారంలోకి వస్తాం. వాటన్నింటినీ పూర్తి చేస్తాం. దీనికితోడు ఈ ప్రాంతంలో పరిశ్రమలపై ప్రత్యేక దృష్టిపెట్టాం. కలెక్టర్‌కు గతంలోనే చెప్పాం. స్థల పరిశీలనలో ఉంది. పర్యాటక ప్రాంతంగా నియోజకవర్గాన్ని తీర్చిదిద్దేందుకు అన్ని వనరులూ ఉన్నాయి. దీనిపైనా దృష్టి సారిస్తున్నాం. ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి వస్తున్న వారు ఇటే రావాలి. కాట్రగడ అయిపోతే ఇటునుంచే అరకు వెళ్లిపోవచ్చు.

గిరిజనుల అవసరాలు తీర్చడం మా బాధ్యత

ఇది వెనుకబడిన ప్రాంతం. ఎంత చేసినా ఇంకా సమస్యలు ఉంటూనే ఉంటాయి. అంచెలంచెలుగా అభివృద్ధి చేసుకుంటూ వస్తున్నాం. గతంలో ఎవరూ, ఎప్పుడూ చేయని విధంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాం. సంక్షేమం కోసం రూ.1,600 కోట్లు, అభివృద్ధికి రూ.1,300 కోట్లు ఖర్చు పెట్టడం చిన్న విషయం కాదు. గిరిజనుల అవసరాలను తీర్చడం మా బాధ్యత. పనులు మంజూరు చేయడమే కాక, వాటిని పూర్తి చేయడమూ మా బాధ్యతే. మా గిరిశిఖర గ్రామాల్లో 12 రోడ్లు మంజూరైతే..అటవీ, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, రెవెన్యూ వంటి శాఖల అనుమతులు పొందడానికే మూడేళ్లు పట్టింది. ఎవరైనా హామీలు ఇస్తే..వాటిని అమలు చేసే బాధ్యత కూడా మీదే అని నాడు దివంగత వైఎస్సార్ చెప్పేవారు. నేడు జగన్ మోహన్‌రెడ్డి కూడా అదే చెబుతారు. దాన్నే నేను పాటిస్తున్నా. అందుకే నేను సవాల్ చేస్తుంటా..ఎక్కడైనా నేను హామీలిచ్చి వదిలేసిన సందర్భాలున్నాయా? అని ప్రశ్నిస్తుంటా. పోడుభూమి, కొండపట్టా, డోలీలు వంటి సమస్యలన్నింటినీ దాదాపు పరిష్కరించాం. రాజన్నదొర మాటిస్తే చేస్తాడన్న నమ్మకం ప్రజల్లో ఉంది.

ఆరేళ్లు ఎమ్మెల్సీగా ఉండి ఏం అభివృద్ధి చేశారు?

టీడీపీ అంటేనే పచ్చపార్టీ. వారి కళ్లకు అంతా పచ్చగానే కనిపిస్తుంది. నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి వారి పచ్చ కళ్లకు కనిపించడం లేదు. అందుకే ఆరోపణలు చేస్తుంటారు. కొన్ని పథకాలను కేంద్రం మంజూరు చేసినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ కలిపి నగదు మొత్తం పెట్టుకుంటాయి. 60:40 శాతం చొప్పున కొన్ని భరిస్తాయి. నేను చేసిన పనులేమిటో ఇక్కడ అందరికీ తెలుసు. పోనీ, ఇక్కడ టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు 2014 నుంచి 2019 వరకు ఎమ్మెల్సీగా పని చేసిన సంధ్యారాణి ఒక్క పని అయినా చేశారా? ఆమెకు చేయాలన్న సంకల్పం, మనసు ఉంటే ఎంతో అభివృద్ధి పనులు చేసేది. నిధులు వెచ్చించేది. నేను తీసుకొచ్చిన పనులనూ ఆమె అడ్డుకున్న సందర్భాలున్నాయి. అప్పట్లో ఉపాధి నిధులు రూ.90 కోట్లతో రోడ్లు తీసుకువస్తే అడ్డుకున్నారు. కలెక్టర్ వివేక్‌యాదవ్ రూ.2.50 కోట్లతో తాగునీరు, సీసీ రోడ్డు పనులు మంజూరు చేయిస్తే ఈ సంధ్యారాణి అడ్డుకున్నారు. ఇటువంటి వ్యక్తులను అభివృద్ధి నిరోధకులుగానే చెబుతాం. చెప్పే మాటలు బూటకం..మేనిఫెస్టో నాటకం. ఓట్ల కోసం ఇప్పుడు ఊరూరా తిరుగుతున్న ఆమె..ఆరు సంవత్సరాల ఎమ్మెల్సీ కాలంలో ఎన్ని ఊర్లు తిరిగారు. ఎంత అభివృద్ధి చేశారు.. చెప్పగలరా? జాబితాతో రండి. సిద్ధమేనా?

మళ్లీ జగనే సీఎం

ప్రచారంలో ప్రజలు మాకు బ్రహ్మరథం పడుతున్నారు. మళ్లీ మిమ్మల్నే గెలిపిస్తామని, జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావాలని అంటున్నారు. కొన్ని పనులు కావాలంటున్నారు. రాసుకుంటున్నాం. మళ్లీ అధికారంలోకి రాగానే అవన్నీ పూర్తి చేస్తాం. రానున్నది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే. జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావడం తథ్యం.

ఉద్యోగులూ.. అపోహ వీడండి

అందరి ఉద్యోగులకూ ఒక అపోహ ఉంది. జగన్ సంక్షేమ పథకాలను ఇవ్వడం వల్లే వారికి జీతాలు పెంచడం లేదని, పీఆర్‌సీ, ఎరియర్స్ ఇవ్వడం లేదని అనుకుంటున్నారు. ఏడాదికి మా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి సుమారు రూ.55 వేల కోట్ల నుంచి రూ.60 వేల కోట్ల వరకు ప్రత్యక్ష నగదు బదిలీ కోసం ఖర్చు పెడితేనే ఇలా అంటున్నారు. మరి రూ.లక్షా 60 వేల కోట్లు చంద్రబాబు ఖర్చు పెట్టే సందర్భం వస్తే ఉద్యోగుల జీతాలు, ఎరియర్స్, కొత్త పీఆర్‌సీ ఇవ్వగలడా? ప్రతి ఒక్క ఉద్యోగీ దీన్ని ఆలోచించాలి. కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలల్లో సౌకర్యాలు కల్పించగలడా? విజ్ఞతతో ఒకసారి ఆలోచించాలని విజ్ఞప్తి చేస్తున్నా.

మాటకు నిలబడే వ్యక్తికే ఓటు

- వైఎస్సార్‌సీపీ మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు



గవరమ్మపేటలో ఎన్నికల హామీ పత్రాన్ని మహిళలకు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్‌రాజు

జియ్యమ్మవలస: ఇచ్చిన మాటను నిలబెట్టుకునే వ్యక్తికే ఓటు వేయాలని వైఎస్సార్‌సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన జియ్యమ్మవలస మండలంలోని గవరమ్మపేట పంచాయతీ పరిధిలో ఉన్న గవరమ్మపేట, వెంకటరాజపురం, ఎరుకలపేట గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ఆర్థిక అభివృద్ధిని కాంక్షిస్తూ గడపగడపకూ నేరుగా సంక్షేమ పథకాలు అందించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అన్నారు. మరోసారి సంక్షేమ ప్రభుత్వ పరిపాలనకు ఈనెల 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి ఆశీర్వదించాలని ఓటర్లను కోరారు. ఎన్నికల హామీలను పూర్తిస్థాయిలో అమలు చేసిన వ్యక్తి సీఎం జగన్‌మోహన్ రెడ్డి అని, పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగనన్నదేనన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కొల్లి సత్యంనాయుడు, నాయకులు కోమటిపల్లి చంద్రశేఖరరావు,అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్



పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకుంటున్న ఆర్డీఓ హేమలత

- రెండోరోజు వియోగించుకున్న ఉద్యోగులు 2,532 మంది

పార్వతీపురంటౌన్: సార్వత్రిక ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులకు ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ సోమవారం రెండవరోజు జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా జరిగింది. పోలీసు సిబ్బంది, ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను వినియోగించుకున్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో ఓటు కలిగి ఉండి జిల్లాలో ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులకు వారి సొంత నియోజక వర్గ కేంద్రాల్లో పోస్టల్ బ్యాలెట్ ఓటుకు ఫెసిలిటేషన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇతర జిల్లాల్లో ఓటు హక్కు కలిగి జిల్లాలో పనిచేస్తున్న ఉద్యోగులు కూడా పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవడానికి పార్వతీపురంలోని శ్రీవేంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు.

రెండవ రోజు ఓటింగ్ ఇలా

జిల్లా వ్యాప్తంగా 6,810 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉండగా తొలిరోజు 3280 మంది వినియోగించుకున్నారు. రెండవ రోజు 2532 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలకు వేర్వేరుగా ఓటింగ్ కంపార్ట్మెంట్లు, సంబంధిత ఫారాలు, బ్యాలెట్లు ఏర్పాటు చేసిన విధానాన్ని అధికారులు పరిశీలించి సిబ్బందికి సూచనలు జారీ చేశారు.

ఇతర జిల్లాల ఉద్యోగులకు గడువు పెంపు

ఇతర జిల్లాల్లో ఓటు హక్కు కలిగి పార్వతీపురం మన్యం జిల్లాలో పని చేస్తున్న ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని రెండు రోజుల పాటూ పొడిగిస్తూ కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిషాంత్ కుమార్ పేర్కొన్నారు. ఇతర జిల్లాల ఉద్యోగులకు మే 5,6 తేదీల్లో శ్రీ వేంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రంలో పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించారు. పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తు సమర్పించి ఇంకా ఓటు హక్కు వినియోగించుకోలేని వారి అభ్యర్థన మేరకు మరో రెండు రోజులు ఓటు హక్కు వినియోగించుకునే వెసులుబాటు కల్పించారు. పోస్టల్ బ్యాలెట్‌కు గతంలో దరఖాస్తులు సమర్పించిన ఇతర జిల్లాలకు చెందిన ఉద్యోగులంతా శ్రీ వేంకటేశ్వరా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రంలో 7,8 తేదీల్లో ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ చేసే వెసులుబాటు కల్పించారు.

హోం ఓటింగ్‌లో 312మంది

వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులకు హోమ్ ఓటింగ్ విధానాన్ని కొత్తగా ప్రవేశపెట్టగా జిల్లాలో 85 ఏళ్లు దాటిన వారు 3,900మంది ఉండగా, 270మంది హోం ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. అలాగే దివ్యాంగులు 12,247మంది దివ్యాంగు లు ఉండగా 383మంది హోమ్ ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. హోమ్ ఓటింగ్ ఎన్నికల సిబ్బంది సోమవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు వారి ఇళ్లకు వెళ్లి హోమ్ ఓటింగ్‌కు చర్యలు తీసుకున్నారు. హోమ్ ఓటింగ్ విధానంలో సెక్టోరల్ ఆఫీసర్, మైక్రో అబ్జర్వర్, పోలింగ్ బూత్ అధికారి, ఆర్మ్‌డ్ సిబ్బంది, వీడియోగ్రాఫర్ పాల్గొన్నారు. ఓటింగ్ ప్లాట్‌ఫాం ఏర్పాటుచేసి ఓటింగ్ విధానం పూర్తి సీక్రెట్‌గా జరిగేలా చర్యలు తీసుకున్నారు.

నియోజకవర్గం	మొత్తం ఓట్లు	తొలిరోజు	రెండవరోజు
పార్వతీపురం	1751	1098	499
సాలూరు	1291	546	561
కురుపాం	2241	910	888
పాలకొండ	1527	726	584
ఇతర జిల్లాలు	1550	773	439

జిల్లాలో హోమ్ ఓటింగ్ ఇలా..

నియోజకవర్గం	పోలైన ఓట్లు
సాలూరు	74
పార్వతీపురం	110
కురుపాం	33
పాలకొండ	95

జూలై నుంచి వలంటీర్లతో పింఛన్ల పంపిణీ

దత్తిరాజేరు: వైఎస్సార్‌సీపీ రెండోసారి అధికారంలోకి వస్తుందని, ముఖ్యమంత్రిగా వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విశాఖ వేదికగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత ఎప్పటివలే వలంటీర్లతో పింఛన్ల పంపిణీ జరుగుతుందని ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య అన్నారు. విజయనగరంలో తన ఇంటి వద్ద 'సాక్షి'తో సోమవారం మాట్లాడారు. చంద్రబాబు ప్రకటించిన తప్పుడు మేనిఫెస్టోను ప్రజల నమ్మరని, గతంలో ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలుచేయకపోవడమే దీనికి కారణమన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి చెప్పారంటే చేస్తారన్న నమ్మకం ప్రజల్లో ఉందన్నారు. గతంలో ఓటువేయని కుటుంబాలకు జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో సంక్షేమ పథకాలు అందాయని, టీడీపీ పాలనలో కంటే వైఎస్సార్‌సీపీ హయాంలోనే మేలు జరిగిందని, టీడీపీ మద్దతుదారులందరూ ఈ సారి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. జగనన్న పాలనకు మహిళా లోకం జై కొడుతోందని తెలిపారు.

సొంత లాభం తప్ప..!

గతంలో ప్రభుత్వపరంగా ఏ పదవీ లేకున్నా నియోజకవర్గాన్ని గుప్పిట్లో పెట్టుకుని పెత్తనం చెలాయించాడు. 2014 నుంచి 2019 వరకు తెలుగుదేశం అధికారంలో ఉండగా ఆ వ్యక్తి ఆగడాలకు అడ్డులేకుండా పోయింది. నియోజకవర్గంలో ఇసుక మాఫియాకు డాన్‌గా వ్యవహరించాడు. ప్రభుత్వపరంగా మంజూరైన పథకాలను తనకు కావాల్సిన వారికే కట్టబెట్టాడు. అలాగే ట్రైకార్ రుణాలు అనుయాయులకు కట్టబెట్టి తన పార్టీ వారి దగ్గరే వసూళ్లు చేసి సొంత వాహనాలు కొనుగోలు చేసుకున్నాడు. 2019లో ఎమ్మెల్యేగా టీడీపీ తరఫున పోటీ చేయగా ప్రజలు తిరస్కరించారు. తాజాగా 2024 ఎన్నికల్లో అదృష్టాన్ని పరీక్షించుకుందామని టీడీపీ టికెట్ ఆశించినా ఆ సీటు కాస్త పొత్తులో భాగంగా జనసేన పార్టీకి వెళ్లిపోయింది. దీంతో రాత్రికి రాత్రి ఊసరవెల్లిలా రంగులు మార్చి జనసేన పార్టీలోకి దూకి ఎమ్మెల్యే టికెట్ దక్కించుకున్నాడు.

- ఎమ్మెల్యే టికెట్ కోసం పూటకో పార్టీలోకి జంప్
- పదవి లేకపోయినా..పెత్తనం
- అప్పట్లో ఇసుక మాఫియా వ్యవహారం
- ట్రైకార్ రుణాలతో సొంతానికి వాహనాలు



సాక్షి, పార్వతీపురం మన్యం:

గతంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో ఏ విధమైన ప్రజాప్రతినిధీ కాదు. అధికార పార్టీకి చెందిన నాయకుడు అన్న ముద్ర ఒక్కటే. అయితేనేం..మొత్తం పాలకొండ నియోజకవర్గాన్ని మొత్తం గుప్పిట్లో పెట్టుకున్నాడు. 2014-19 సంవత్సరాల మధ్య ప్రభుత్వపరంగా ఏ పథకం మంజూరు కావాలన్నా..ఆయన అంగీకారం ఉండాల్సిందే. అప్పట్లోనే ఎమ్మెల్యేగా తన అదృష్టాన్ని పరీక్షించుకుందామనుకుని విశ్వప్రయత్నాలు చేసినప్పటికీ.. నియోజకవర్గ ప్రజలు తిరస్కరించారు. మళ్లీ ఇప్పుడు ఎన్నికలొచ్చాయి. నియోజకవర్గంలో టీడీపీ టికెట్ తనదేనని భావించి గట్టి ప్రయత్నాలే చేసినప్పటికీ..చివరి నిమిషంలో పొత్తులో భాగంగా మరో పార్టీకి ఇక్కడి సీటు వెళ్లడంతో..అందుకోసం ఇన్నాళ్లూ ఉన్న పార్టీని తృణప్రాయంగా వదిలేశా డు. పక్క పార్టీ కండువా కప్పేసుకుని టికెట్ సాధించాడు.

రుణం పొందాలన్నా..రథం కావాలన్నా..

2014- 2019 కాలంలో రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉంది. ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేలున్న నియోజకవర్గాలకు చంద్రబాబు ప్రభుత్వం కనీసం సహకారం అందించలేదు. పాలకొండ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ నుంచి విశ్వాసరాయి కళావతి ఎమ్మెల్యేగా ఉన్నారు. అప్పట్లో ప్రభుత్వపరంగా ఏ పథకం మంజూరైనా నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి అనుమతి తప్పనిసరి. కనీసం ఎమ్మెల్యేకు నామమాత్రమైనా సమాచారం ఇవ్వకుండా పథకాలను ఇష్టానుసారం సొంత పార్టీ నేతలకు అందజేశారు. ప్రస్తుతం ఎమ్మెల్యే అభ్యర్థిగా జనసేన పార్టీ తరఫున పోటీ చేస్తున్న..అప్పటి టీడీపీ ఇన్‌చార్జిగా వ్యవహరించిన వ్యక్తి మొత్తం అంతా తానై నడిపించాడు. రైతు రథాలన్నీ ఆ పార్టీ వారికే. ట్రాక్టరుకు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకూ వసూలు చేశాడు. ట్రైకార్ రుణాలను సైతం తాను సూచించిన వారికే ఇప్పించాడు. కొంత రుణాలను దారి మళ్లించి..సొంతానికి వాహనాలు సమకూర్చుకున్నాడన్న ఆరోపణలు ఉన్నాయి. ఇసుక మాఫియా అతని కనుసన్నల్లోనే నడిచింది. వీరఘట్టం మండలంలోని ఓ ఇసుక ర్యాంపు, ఆయనతోపాటు, అనుచరులు పాలకొండ నాగావళి నదీ తీరాన్ని కొల్లగొట్టారు. అంగన్‌వాడీల నుంచి షిఫ్ట్ ఆపరేటర్ పోస్టుల వరకు అమ్ముకున్నట్లు అప్పట్లో పెద్దఎత్తున ఆరోపణలు వచ్చాయి. నీరు-చెట్టులో పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడ్డారన్న విమర్శలున్నాయి.

క్యాడర్‌తోనూ దూరం

ఏ పార్టీకైనా క్యాడరే బలం. అలాంటిది ఆయనతో పదేళ్లగా టీడీపీ శ్రేణులు నరకయాతన అనుభవిస్తున్నారు. పార్టీలో వివాదాస్పదుడిగా, కళా వెంకటరావు వర్గీయుడిగా ముద్ర పడిపోయాడు. దీంతో టీడీపీలోని ఓ వర్గం ఆయనకు వ్యతిరేకంగా పనిచేయడం ప్రారంభించింది. కొత్తగా పడాల భూదేవి వర్గం తెరపైకి వచ్చింది. ఆమె సైతం టీడీపీ టికెట్ కోసం తీవ్రస్థాయిలో ప్రయత్నాలు చేశారు. ఒకానొక దశలో వారిద్దరి మధ్య విభేదాలు తారస్థాయికి వెళ్లాయి. ఈలోగా ఎన్నికలు రావడంతో టికెట్ కోసం ఎవరి ప్రయత్నాలు వారు చేసి, తీరా చివరి నిమిషంలో మరో పార్టీలోకి ఇద్దరూ కుప్పిగంతులు వేశారు. ప్రస్తుతం పాలకొండ నియోజకవర్గం నుంచి జనసేన తరఫున సదరు అభ్యర్థి బరిలో ఉన్నప్పటికీ.. మిగతా వర్గం ఆయనకు దూరంగానే ఉంటోంది. ప్రధానంగా టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పడాల భూదేవి వర్గం అంటీముట్టనట్లే ఉంటోంది. అంతేకాదు.. నాలుగు మండలాల్లో క్యాడర్ అతని అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తోంది.

నియోజకవర్గ ప్రజల్లో చర్చ..

సదరు వ్యక్తి వ్యవహారశైలిపై నియోజకవర్గ ప్రజల్లో ఇప్పుడు జోరుగా చర్చ సాగుతోంది. అప్పట్లోనే లబ్ధిదారుల పేరిట భారీగా స్వాహా చేశాడని..తన అనుచరులకే చాలా వరకూ కట్టబెట్టాడని గుర్తు చేసుకుంటున్నారు. ప్రతి పనికీ లంచాలు మరిగిన వ్యక్తి అని చర్చించుకుంటున్నారు. అధికారం కోసం రాత్రికి రాత్రి పార్టీలు మారే వ్యక్తి..ఇంక ప్రజల బాగోగులు ఏం పట్టించుకుంటాడని ప్రశ్నిస్తున్నారు.

క్లుప్తంగా

స్కూటీ దగ్ధం


ఎగిసిపడుతున్న మంటలు

సాలూరు: పట్టణంలోని డబ్బీవీధి మామిడిపల్లి రోడ్డు పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ పేలి అగ్నిప్రమాదం సంభవించడంతో ఓ స్కూటీ కాలిపోయింది. దీనిపై అగ్నిమాపక శాఖ అధికారి సుధాకరరావు తెలిపిన వివరాల ప్రకారం..సోమవారం మధ్యాహ్నం డబ్బీవీధి మామిడిపల్లి రోడ్డు పక్కన గల 160 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ పేలి, మంటలు చెలరేగాయి.ఈ అగ్నిప్రమాదంలో సమీపంలో ఉన్న స్కూటీ కాలిపోయింది. ఈ సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి వెళ్లి మంటలు అదుపుచేశారు. పేలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ విలువ సుమారు రూ.17 లక్షలు ఉంటుందని ఎలక్ట్రికల్ ఎ.డి రంగారావు తెలిపారు.

పోలింగ్ కేంద్రాల వద్ద ప్రథమ చికిత్సాకేంద్రాలు

- డీఎంహెచ్ఓ భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: సాధారణ ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఏడు నియోజకవర్గాల్లోని 1847 పోలింగ్ కేంద్రాల వద్ద ప్రథమ చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు డీఎంహెచ్ఓ ఎస్. భాస్కరరావు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, పోలింగ్ కేంద్రాలకు సామగ్రి అందజేసే కేంద్రాల వద్ద 12వ తేదీన.. పోలింగ్ కేంద్రాల వద్ద 13వ తేదీన చికిత్సా కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. అదేవిధంగా స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద 13వ తేదీ సాయంత్రం శిబిరాలు ఉంటాయని తెలిపారు. ఇదిలా ఉంటే ఎన్నికల నేపథ్యంలో వైద్యారోగ్యశాఖ సిబ్బందికి ఈ నెల 11 నుంచి 15 వరకు ఎటువంటి సెలవులు మంజూరు చేయమన్నారు.

పోక్సో కేసులో ముద్దాయికి జైలు శిక్ష

విజయనగరం క్రైమ్: రూరల్ పోలీస్ స్టేషన్‌లో 2020లో నమోదైన పోక్సో కేసులో నేరం రుజువు కావడంతో ముద్దాయికి న్యాయమూర్తి కె.నాగమణి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ. 2,500 జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు చెప్పారని విజయనగరం రూరల్ సీఐ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. మండల పరిధిలోని ద్వారపూడి గ్రామానికి చెందిన క్లోపల్లి అప్పారావు (61) అనే వ్యక్తి ఐదేళ్ల చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడినట్లు బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ పోలీస్‌స్టేషన్లో 2020 జనవరిలో అప్పటి ఎస్సై ప్రసన్నకుమార్ కేసు నమోదు చేశారు. ఎస్సీ, ఎస్టీ సెల్-1 డీఎస్పీ బి.మోహనరావు దర్యాప్తు చేపట్టి నిందితుడ్ని అరెస్టు చేసి న్యాయస్థానంలో ప్రవేశపెట్టారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి నాగమణి ముద్దాయికి జైలుశిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. పోలీసుల తరఫున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మావూరి శంకరరావు వాదనలు వినిపించగా.. ప్రస్తుత డీఎస్పీ ఆర్.గోవిందరావు పర్యవేక్షణలో రూరల్ సీఐ ఎం.శ్రీనివాసరావు, ఎస్సై ఆర్. వాసుదేవ్, కోర్టు ఉమెన్ కానిస్టేబుల్ టి.లక్ష్మి, సీఎంఎస్ హెచ్‌సీ రామకృష్ణ సాక్షులను సకాలంలో కోర్టులో హాజరుపర్చారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

రాజాం సిటీ: మండల పరిధి గురవాం గ్రామ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు వ్యక్తులు గాయపడ్డారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజాం నుంచి పాలకొండ వెళ్తున్న ఆటోను డోలపేటకు చెందిన గోవింద్ ద్విచక్రవాహనంపై వస్తూ వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఆటో అదుపుతప్పి పక్కకు పడిపోగా సారధి గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ బి.మురళితో పాటు అందులో ప్రయాణిస్తున్న పాలకొండ మండలం తంపటాపల్లికి చెందిన పకీరు, వీరఘట్టం మండలం నందివాడకు చెందిన చందు గాయపడ్డారు. ద్విచక్రవాహనదారుడు గోవింద్‌కు కూడా గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు స్పందించి క్షతగాత్రులను 108 వాహనం ద్వారా రాజాం సామాజిక ఆస్పత్రికి తరలించారు. ఆటోడ్రైవర్ మురళి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై ఎస్. భాస్కరరావు తెలిపారు.

సెంచూరియన్‌లో వక్తృత్వ పోటీలు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో ఓటింగ్ ఫర్ గుడ్ గవర్నెన్స్ అనే అంశంపై సోమవారం వక్తృత్వ పోటీలు నిర్వహించారు. సీసీసీడీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో బీఎస్సీ అనస్థీషియా విద్యార్థి వహీదా మొదటి బహుమతి, నిఖిల్ రెండో బహుమతి, ప్రజ్ఞ మూడో బహుమతి సాధించారు. విజేతలను వీసీ పీకే మహంతి, రిజిస్ట్రార్ పల్లవి అభినందించారు.

ల్యాండ్ టైట్లింగ్ రాద్ధాంతం

- టీడీపీపై రైతుల ధ్వజం

వీరఘట్టం:

పాకిస్తాన్ తీవ్రవాదుల కంటే దారుణంగావ్యవహరిస్తున్న టీడీపీ అధినేత చంద్రబాబు వ్యవ హారశైలిపై అన్ని వర్గాల ప్రజలు మండిపడుతున్నా రు. తాజాగా ల్యాండ్ టైట్లింగ్ చట్టంపై చంద్రబాబు చేస్తున్న అసత్య ప్రచారాలను ఎవరూ నమ్మవద్దని రాజకీయ విశ్లేషకులు, మేధావులు హితవు చెబుతున్నారు. ఏదో ఒక విధంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంపై బురదజల్లడమే పనిగా పెట్టుకున్న పచ్చమీడియా రాతలపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వారి ఆగ్రహం వారి మాటల్లోనే...



రీ-సర్వేతో రైతులకు ఎంతో మేలు



ల్యాండ్ టైట్లింగ్ చట్టంలో భాగంగా చేపడుతున్న రీ-సర్వేతో ఎన్నో సమస్యాత్మక భూములకు చిక్కులు వీడాయి. ఎన్నో సవాళ్లతో కూడికుని ఉన్న భూముల రీ-సర్వేను ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయవంతంగా నిర్వహిస్తూ, రైతులకు వివాద రహిత భూమిని అందిస్తున్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ కూటమి ఓటమి ఖాయమని సర్వేలు చెబుతుండడంతో ఆ ఫ్రస్టేషన్‌లో ఉన్న చంద్రబాబు పనిగట్టుకుని ఏదో ఒక అంశంపై రాష్ట్రంలో విధ్వంసం సృష్టించాలని చూస్తున్నారు. ఆయనకు తోడుగా పచ్చమీడియా ఉండడంతో పనిగట్టుకుని ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు.ఈ ప్రచారాలను ప్రజలు నమ్మేస్థితిలో లేరు.

కర్రి గోవిందరావు,
పీఏసీఎస్ అధ్యక్షుడు, వీరఘట్టం

వందేళ్లనాటి భూవివాదాలకు శాశ్వత పరిష్కారం



ఎప్పుడో బ్రిటిష్ కాలంలో భూసర్వే జరిగింది. తర్వాత చాలా ప్రభుత్వాలు మారాయి గాని ఎవరూ ఈ భూసర్వేను పట్టించుకోకపోవడంతో నిత్యం భూ సమస్యలతో రైతులు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.ఇటువంటి వందేళ్ల నాటి భూసమస్యలకు ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ ద్వారా శాశ్వత పరిష్కారం దొరుకుతుందని మేధావులు చెబుతున్నారు. ఈ పనిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఓ యజ్ఞంలా మూడేళ్లుగా చేపడుతుండడంతో ప్రజలు,రైతుల్లో జగన్‌మోహన్ రెడ్డిపై ఓ సుస్థిర స్థానం ఏర్పడింది.దీన్ని తట్టుకోలేక పచ్చమీడియాతో కలిసి చంద్రబాబు ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు.

దమలపాటి వెంకటరమణనాయుడు,
ఎంపీపీ, వీరఘట్టం

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం



ల్యాండ్ టైట్లింగ్ చట్టంతో భూసమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తోందని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. మా భూములు రీ-సర్వే చేసినప్పుడు మమల్ని పిలిచి మా ముందరే సర్వే చేశారు. మా భూమి రికార్డుల్లో ఎంత ఉంది? భౌతికంగా ఎంత ఉందో కచ్చితంగా నిర్ధారించి భూమిని అప్పగించారు. అటువంటప్పుడు నా ప్రమేయం లేకుండా నా భూమిని ఎవరు కాజేస్తారు.ఇది కేవలం చంద్రబాబు ఆడుతున్న ఎన్నికల గిమ్మిక్కు. ఇటువంటి ట్రిక్కులను, చంద్రబాబును ప్రజలు నమ్మే రోజులు పోయాయి.

కిల్లారి శ్రీనివాసరావు,
రైతు,వీరఘట్టం

ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం పద్ధతి కాదు



ఎన్నికలు సమీపిస్తుండడంతో ఓటమి భయంతో చంద్రబాబునాయుడు చేస్తున్న గిమ్మిక్కులు ఇవి. తొలుత ల్యాండ్ టైట్లింగ్ చట్టంపై అవగాహన లేనివాళ్లు భయపడ్డారు.తర్వాత ఈ చట్టంపై అందరూ అవగాహన పెంచుకున్న తర్వాత ఇదంతా చంద్రబాబు చేస్తున్న కుట్ర అని అర్థం చేసుకున్నారు. ఈ ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ధైర్యంగా ఎదుర్కొనే దమ్ములేక చంద్రబాబు ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై అసత్యప్రచారాలు చేస్తున్నారు. ఇటువంటి తప్పుడు ప్రచారాలు చేయడం పద్ధతి కాదు. కర్రి లీలాప్రసాదరావు, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు, వీరఘట్టం

కాళ్ల గౌరీశంకర్ ఆరోపణలు అవాస్తవం

- కోలగట్ల ప్రతిష్టను దెబ్బతీసేందుకు యత్నం
- వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పార్వతీపురం-మన్యం జిల్లా అధ్యక్షుడు
- శత్రుచర్ల పరీక్షిత్‌రాజు


సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు

విజయనగరం: ఎన్నికల సమయంలో వాస్తవాలను వక్రీకరించి బురద రాజకీయాలు చేయడం కాళ్ల గౌరీశంకర్ లాంటి వ్యక్తులకు తగదని వైఎస్సార్‌సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్ రాజు అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన విజయనగరం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నగరంలోని కంటోన్మెంట్ ప్రాంతంలో ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యాలయం విషయంలో కాళ్ల గౌరీశంకర్ చేసిన ఆరోపణలు పూర్తి అవాస్తవమని ఖండించారు. చేతనైతే స్వచ్ఛమైన రాజకీయాలు చేయాలే తప్ప, ఇటువంటి నీచ రాజకీయాలకు దిగజారకూడదన్నారు. వాస్తవానికి పార్టీ కార్యాలయం ఉన్న స్థలాన్ని కోలగట్ల వీరభద్ర స్వామి నుంచి తాను, మరో నలుగురం కలిసి కొనుగోలు చేశామని చెప్పారు. అనంతరం స్థలం సర్దుబాటు, దిక్కుల విషయంలో పొరపొచ్చాలు వచ్చాయన్నారు. దీంతో ముగ్గురు భాగస్వాములు కోర్టుకు వెళ్లారన్నారు. కోర్టు ద్వారానే హద్దులు, దిక్కులు నిర్ణయించుకునే అవకాశం ఉందని చెప్పారు. ఇంతలో ఆ స్థలం నిరుపయోగంగా పడి ఉంటే చెత్తాచెదారాలు చేరి చెదలు పట్టి ఇబ్బందులు పడతామన్న ఉద్దేశంతో దూబే అనే వ్యక్తికి లీజుకు ఇచ్చి ఆయనకే కొనసాగిస్తున్నామని చెప్పారు. ఈ విషయంలో ఏదో జరిగిపోయినట్లు లేనిపోని విషయాలను తెరపైకి తెచ్చి గౌరీశంకర్ రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని మండిపడ్డారు. రాజకీయాల్లో కొంత అనుభవం ఉన్న ఆయన ఇటువంటి దిగజారుడు రాజకీయాలు చేయకూడదని, గిరిజన ప్రాంతానికి చెందిన తనకు స్వచ్ఛమైన రాజకీయాలు చేయడం మాత్రమే వచ్చునని, గౌరీశంకర్ లాంటి కమర్షియల్ పాలిటిక్స్ తెలియవన్నారు. ఎన్నికల సమయంలో రాజకీయంగా ఎన్నో ఆరోపణలు చేయవచ్చు కానీ వ్యక్తిగతంగా విమర్శలు చేయడం మంచి సంస్కృతి కాద న్నారు.

ప్రజలతోనే ఉంటున్న కోలగట్ల

కోలగట్ల వీరభద్ర స్వామి లాంటి వ్యక్తి విజయనగరంలో అభివృద్ధి చేయలేదని చెప్పగలరా? అని ప్రశ్నించారు. నగర సుందరీకరణ చేపట్టలేదని ఎక్కడైనా చెప్పగలరా? అంటూ నిలదీశారు. ఎన్నికల వరకు కనిపించని అదితి గజపతిరాజు హఠాత్తుగా సాక్షాత్కరించి ప్రజలకు అందుబాటులో ఉంటామని చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కళాశాల స్థాయి నుంచి రాజకీయాలు చేస్తున్న వీరభద్ర స్వామి అనునిత్యం ప్రజలతోనే ఉంటారన్నది అందరికీ తెలిసిందేనన్నారు. అంత ప్రజా నాయకుడిని అప్రతిష్టపాలు చేసేందుకు గౌరీశంకర్ చేస్తున్న ప్రయత్నం నిష్ఫలితమని కొట్టిపారేశారు. ఇకనైనా హుందాగా మసులుకోవాలని హితవు పలికారు. సమావేశంలో కార్పొరేటర్లు కంటుభుక్త తవిటి రాజు, బోనెల ధనలక్ష్మి, వింత ప్రభాకర్ రెడ్డి, సుంకరి నారాయణస్వామి, నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్ అవనాపు లక్ష్మణరావు, మాజీ కౌన్సిలర్లు త్రినాథరావు, కరణం రమణారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు నారాయణప్పదు, లెంక మహేష్, కనకలగిరి తదితరులు పాల్గొన్నారు.

వారంతా వైఎస్సార్‌సీపీలోనే ఉన్నారు

- ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్


పనసనందివాడ గ్రామస్తులకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్సీ

వీరఘట్టం: మండలంలోని పనసనందివాడలో పాగ పెట్టాలని చూసిన గ్రామానికి చెందిన దొంగ నాయుళ్ల ఆటలు ఇకసాగవని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం పనసనందివాడలో పర్యటించిన ఎమ్మెల్సీ విక్రాంత్ గ్రామస్తులతో మాట్లాడారు. ఈ ఎన్నికల్లో ప్రత్యర్థులు దొంగదెబ్బ తీయాలని చూస్తున్నారని విమర్శించారు. ఈ దొంగాటలో భాగంగా గ్రామానికి చెందిన 200 కుటుంబాలు వైఎస్సార్‌సీపీని వీడి జనసేనలో చేరినట్లు తప్పుడు ప్రచారం చేస్తూ మనల్ని మానసికంగా దెబ్బతీయాలని చూస్తున్నారన్నారు. గ్రామంలో ఉన్న ఎస్సీ, బీసీలకు చెందిన 170 కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీలోనే ఉన్నారని ఎమ్మెల్సీ విక్రాంత్ స్పష్టం చేశారు. కొందరు దొంగనాయుళ్లు స్వార్థ రాజకీయాల కోసం ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ధ్వజమెత్తారు. వారి స్వప్రయోజనాల కోసం గ్రామాన్ని తాకట్టుపెట్టడానికి కూడా వెనుకాడకుండా ఉన్నారంటే అటువంటి వ్యక్తులు మనకొద్దన్నారు. తెట్టంగి గ్రామం నుంచి తలవరం వరకు ఉన్న రింగ్ రోడ్డులో ఉన్న గ్రామాలన్నీ పాలవలస రాజశేఖరం కుటుంబాలే అని విక్రాంత్ స్పష్టం చేశారు.

తప్పుడు కథనంతో మేలు

విక్రాంత్ స్వగ్రామం పనసనందివాడ వాసుల మద్దతు కూటమికే అని సోమవారం ఈనాడులో రాసిన కథనం మాకు ఎంతో మేలు చేసిందని చెబుతున్నాను. ఇక్కడ ఉన్న కొందరు వ్యక్తులను ఎంతగానో నమ్మితే వారు ప్రజలను తప్పుదోవ పట్టించి గ్రామస్తులంతా జనసేనలో చేరుతున్నట్లు తప్పుడు ప్రచారం చేసి పబ్బం గడుపుకోవాలని చూసిన వారికి రోజులు దగ్గర పడ్డాయని హెచ్చరించారు. ఇంతవరకు గ్రామంలో జరిగిన విషయాలను పక్కన పెట్టి మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వాసరాయి కళావతిని, ఎంపీ అభ్యర్థి తనూజారాణి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అంతకుముందు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ పెద్దలు నిష్టల సన్యాసిరావుభుక్త, జీవరత్నం, సుందరరావు, బొత్స ప్రకాశరావు, శామ్యూల్ మాట్లాడుతూ తాము వైఎస్సార్‌సీపీని వీడినట్లు వచ్చిన వార్తలు పూర్తిగా అవాస్తవమని సభాముఖంగా స్పష్టం చేశారు. పనసనందివాడలో వైఎస్సార్‌సీపీ ఓటు బ్యాంకు పదిలంగానే ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, జెడ్పీటీసీ జంపు కన్నతల్లి, వైస్ ఎంపీపీ పత్రి విజయకుమారి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రి లీలాప్రసాదరావు, పాలకొండ ఏఎంసీ వైస్‌చైర్మన్ పొట్నూరు లక్ష్మణరావు, ఎంపీటీసీ బుగత అమృతరావు, బౌరోతు రాజశేఖర్, శిష్టు మధుసూదనరావు, దేవకివాడ భుజంగరావు, మొట్ట వెంకటరమణ, మెరుగుల చంద్రమౌళి, వావిలపల్లి హరిబాబు, పాలవలస ధవళేశ్వరరావు పాల్గొన్నారు.

మొదటి విడత స్ప్రేయింగ్ పకడ్బందీగా నిర్వహించాలి


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి.జగన్‌మోహనరావు

- డీఎంఓ డాక్టర్ టి.జగన్‌మోహనరావు

పార్వతీపురంటౌన్: దోమల నివారణ మందు స్ప్రేయింగ్ మొదటి విడత పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి.జగన్‌మోహనరావు ఆదేశించారు. ఈ మేరకు సబ్ యూనిట్ అధికారులు, మలేరియా టెక్నికల్ సూపర్‌వైజర్స్‌తో మలేరియా కార్యాలయంలో సోమవారం ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎంపిక చేసిన 401 మలేరియా ప్రభావిత గ్రామాల్లో ఈనెల 15వ తేదీ నుంచి నిర్వహించనున్న మొదటి విడత ఐఆర్ఎస్ స్ప్రేయింగ్‌కు ముందస్తుగా వేసిన ప్రణాళిక ప్రకారం కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. వీటికి సంబంధించిన మార్గదర్శకాలను ఇప్పటికే జారీ చేసినట్లు చెప్పారు. జిల్లాలో ఉన్న ఏడు సబ్‌యూనిట్స్ పరిధిలో స్ప్రేయింగ్ నిర్వహించాల్సిన గ్రామాల వివరాలను పీహెచ్‌సీల వారీగా పరిశీలించారు. ఆయా గ్రామాల పరిధిలో సమన్వయ శాఖతో సమావేశాలు నిర్వహించి ఇంటింటికీ చేపట్టబోయే ఐఆర్ఎస్ స్ప్రేయింగ్ కార్యాచరణపై సమీక్షించాలని సూచించారు. స్ప్రేయింగ్ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని చెప్పారు. సిబ్బంది సమష్టిగా కృషి చేసి మలేరియా, డెంగీ తదితర జ్వరాలు అదుపులో ఉండేందుకు పాటుపడాలని కోరారు. సమావేశంలో ఏఎంఓ సూర్యనారాయణ, వీబీడీ కన్సల్టెంట్ రామచంద్ర, ఈఓ నాగేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో సాధారణ ప్రసవాలు జరిగేలా దృష్టి

- డీఎంహెచ్ఓ కె.విజయపార్వతి


బందలుప్పి పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ కె.విజయపార్వతి

పార్వతీపురం టౌన్: పీహెచ్‌సీల్లో సాధారణ ప్రసవాలు జరిగేలా దృష్టి సారించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ కె. విజయపార్వతి అన్నారు. ఈ మేరకు ఆమె పార్వతీపురం మండలంలోని డోకిశీల, బందలుప్పి పీహెచ్‌సీలను సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ జరుగుతున్న కాన్పుల రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. ల్యాబొరేటరీ, వ్యాక్సిన్, మందుల నిల్వలు పరిశీలించారు. అనంతరం పీహెచ్‌సీలో సిబ్బందితో మాట్లాడుతూ సాధారణ కాన్పులు జరిగేలా దృష్టి సారించాలని ఆదేశించారు. అక్కడి రోగులతో మాట్లాడి వారి ఆరోగ్య సమస్యలు తెలుసుకున్నారు. వడదెబ్బ, డీహైడ్రేషన్ సమస్యలు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓఆర్ఎస్ అన్ని గ్రామాల్లో అందుబాటులో ఉంచాలని, టీకా కార్యక్రమాలను గ్రామాల్లో త్వరగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఆశ కార్యకర్తలు వారి పరిధిలో ఉన్న గర్భిణులు, బాలింతల ఆరోగ్య జాగ్రత్తల గురించి ఫోన్ 0124441660 నంబర్ నుంచి వచ్చే కిల్కారీ సందేశాన్ని వినేలా పర్యవేక్షణ చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ ఐశ్వర్య, డా. కౌశిక్, డెమో యోగీశ్వరరెడ్డి, సూపర్‌వైజర్స్ జయగౌడ్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘన కాదా?

- ఓటర్లకు టీడీపీ ప్రలోభాలు?


మాక్ ఈవీఎంలను పట్టుకుని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో తిరుగుతున్న టీడీపీ నాయకులు

సాలూరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ఫెసిలిటేషన్ కేంద్రంలో ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బంది తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్న వేళ కొందరు టీడీపీ నాయకులు ఓటర్లను ప్రలోభాలకు గురిచేసేలా వ్యవహరించారు. అక్కడ వేసిన టెంట్లలో కూర్చుని, టీడీపీ అభ్యర్థికి ఓట్లు వేయాలంటూ పార్టీ గుర్తు కనిపించేలా మాక్ ఈవీఎంలను వెంటపట్టుకుని తిరిగారు. తమదైన శైలిలో ప్రలోభాలకు గురిచేసేందుకు ప్రయత్నించారు.ఇది కోడ్ ఉల్లంఘన కిందికి వస్తుందా? రాదా? అని ఎన్నికల అధికారులు పరిశీలించి, తగు చర్యలు తీసుకోవాలని పలువురు ఓటర్లు అక్కడ మాట్లాడుకోవడం తారసపడింది.

భారీ వర్షం

భామిని: మండలంలో ఈదురుగాలులతో కూడిన వర్షం పడడంతో సోమవారం జనజీవనం స్తంభించింది. ప్రధాన రహదారుల్లో వర్షపునీరు ప్రవహించింది. గాలుల ఉధృతితో చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. తాటిమానుగూడ వద్ద భారీ మర్రిచెట్టు నేలకొరిగింది. గిరిజన యువకులు రోడ్లపై పడ్డ చెట్ల కొమ్మలు తొలగించడంతో వాహనాల రాకపోకలు కొనసాగాయి. సాయంత్రం నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కొద్ది రోజులుగా ఎండ తీవ్రతకు ఇబ్బందులు పడిన ప్రజలకు ఈవర్షం కొంత ఊరటనిచ్చింది.


కురుస్తున్న భారీ వర్షం


విరిగిపడిన చెట్ల కొమ్మలను తొలగిస్తున్న గిరిజన యువత

టార్గెట్ విజయమే

త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ఎన్నికల బరిలో ఉన్న ఎమ్మెల్యే అభ్యర్థులు ప్రచారంలో జోరు చూపిస్తున్నారు. గడిచిన ఐదేళ్లుగా ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వం తరఫున అందజేసిన సంక్షేమం, అభివృద్ధిని వివరిస్తూ..మరోసారి తమను గెలిపిస్తే మరింతగా సంక్షేమం, అభివృద్ధిని అందజేస్తామని హామీ ఇస్తున్నారు. తమకు ఓటు వేసి గెలిపించి మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని అధికార పీఠంపై కూర్చోబెట్టాలని ఓటర్లను అభ్యర్థిస్తున్నారు.

-సాక్షి నెట్‌వర్క్


భామిని: సతివాడలో ఎన్నికల ప్రచార ర్యాలీలో పాల్గొని జై జగన్ నినాదాలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ పాలకొండ ఎమ్మెల్యే అభ్యర్థి కళావతి


కురుపాం: మొండెంఖల్ గ్రామంలో ఎన్నికల ప్రచారంలో ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని అభ్యర్థిస్తున్న వైఎస్సార్‌సీపీ కురుపాం ఎమ్మెల్యే అభ్యర్థి పాముల పుష్పశ్రీవాణి


సాలూరు రూరల్: కొట్టుపరువు పంచాయతీలో ఇంటింటి ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పీడిక రాజన్నదొర


పార్వతీపురంటౌన్: పుట్టూరులో ఎన్నికల ప్రచారంలో ప్రజలకు అభివాదం చేస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అలజంగి జోగారావు

క్లుప్తంగా

పింఛన్ అందలేదన్న బెంగతో వృద్ధుడి మృతి



పైడయ్య మృతదేహం, (ఇన్‌సెట్‌లో) ముచ్చపైడయ్య (ఫైల్)

మెరకముడిదాం: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, నిమ్మగడ్డ రమేష్ ఎన్నికల సంఘానికి చేసిన ఫిర్యాదు ఫలితం మరో వృద్ధుడిని బలితీసుకుంది. పింఛన్ అందలేదన్న బెంగతో మెరకముడిదాం మండలం రామాయవలస సచివాలయం పరిధిలోని ముచ్చపైడయ్య (72) అనే వృద్ధుడు చనిపోయాడు. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. పైడియ్యకు భార్య, పిల్లలు లేరు. కొన్నేళ్లుగా సోమలింగాపురంలో నివసిస్తున్న ఆయన వదిన కుమారుడు తవుడు వద్ద ఉంటున్నాడు. ఆయనకు ప్రతినెలా ప్రభుత్వం మంజూరు చేసిన రూ.3వేలు ఫించన్‌ను వలంటీరు ఇంటికి తెచ్చి అందించే వాడు. మే నెల పింఛన్ డబ్బులు మెరకముడిదాంలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు (ఏపీజీవీబీ)లోని ఆయన ఖాతాకు జమయ్యాయి. దీనికోసం నాలుగు రోజులుగా తిరుగుతున్నాడు. బ్యాంకు ఖాతా స్తంభించిపోవడంతో వేలిముద్రలు వేయాల్సి వచ్చింది. ఆయన వేలిముద్రలు సరిగా నమోదుకాకపోవడంతో పింఛన్ డబ్బులు చేతికి అందలేదు. బ్యాంకు, సచివాలయ సిబ్బంది ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. పింఛన్ మరి అందదేమోనంటూ గ్రామస్తులు, వదిన కుమారుడు వద్ద తరచూ వాపోయాడు. పింఛన్ అందుతుందని ధైర్యం చెప్పినా మనస్థాపానికి గురై ఆదివారం అర్ధరాత్రి పైడయ్య మృతిచెందినట్టు బంధువులు తెలిపారు.

టీడీపీకి ఓటమి భయం



మాట్లాడుతున్న కొండంపేట వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు

రాజాం: అటు రాష్ట్రంలోనూ, ఇటు రాజాంలోనూ టీడీపీ ఓడిపోతుందన్న భయంతో ఆ పార్టీ కార్యకర్తలు తప్పుడు ప్రచారాలు చేయడం ప్రారంభించారని స్థానిక పట్టణ పరిధిలోని కొండంపేటకు చెందిన వైఎస్సార్ సీపీ నేతలు సలాది తులసీరావు, సతీష్, వెంపల రాములు ఆరోపించారు. ఇదే విషయమై కొండంపేటలో విలేకరుల సమావేశం సోమవారం నిర్వహించి, మాట్లాడారు. అన్నివర్గాల ప్రజలు వైఎస్సార్ సీపీ వెంటే ఉన్నారని, రానున్న ఎన్నికల్లో రాజాంలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్‌కి భారీ మెజార్టీ రానుందన్నారు. ఈ విషయం తెలిసి ఓటర్లను మభ్యపెట్టేందుకు ఇదే కొండంపేటకు చెందిన టీడీపీ కార్యకర్తలు సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెడుతున్నారన్నారు. గ్రామంలో టీడీపీ కార్యకర్తలు ప్రచారం చేస్తుంటే విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని ప్రచారం చేస్తున్నారని, వాస్తవానికి వారి ప్రచార సమయంలో గ్రామంలో విద్యుత్ సరఫరా ఉండడంతో పాటు వారు మాట్లాడుతున్నప్పుడు వారి వెనక ఇళ్లల్లో విద్యుత్ కాంతులు స్పష్టంగా కనిపిస్తున్నాయన్నారు. ఓటర్లను తప్పుదోవ పట్టించేందుకు టీడీపీ కార్యకర్తలు ఎన్ని కుతంత్రాలు పన్నినా ప్రజలు నమ్మరన్నారు. ఇక్కడ డాక్టర్ తలే రాజేష్ గెలుపు ఎప్పుడో ఖాయమైపోయిందన్నారు.

బేబీ నాయనకు ఓటమి ఖాయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి:

నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బేబీ నాయనకు ఓటమి భయం పట్టుకున్నట్టుందని, ఆయన ఒక ఎమ్మెల్యే అభ్యర్థి అనే విషయం కూడా మర్చిపోయి అజ్ఞానిలా మాట్లాడుతున్నారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు విమర్శించారు. సోమవారం స్థానిక గొల్లపల్లిలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ విషయమై వైఎస్సార్ సీపీ నేతలపై బేబీ నాయన చేసిన ఆరోపణలను ఎమ్మెల్యే ఖండించారు. తమ పార్టీ నేతలు పోస్టల్ బ్యాలెట్ ఓటు వినియోగించుకుంటున్న ఉద్యోగులను వారు ఓటు వేసిన ఫొటోలను తీసి, పంపాలని బెదిరిస్తున్నట్లు బేబీ నాయన అన్నారని, ఆయన మాటల్లో ఏమాత్రం వాస్తవం లేదన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ జరిగే సమయంలో ఫోన్ల వాడకానికి అంతగా అనుమతి ఉండదని, ఒకవేళ అనుమతి ఉన్నా ఫొటోలు తీయడం అస్సలు కుదరదన్న విషయం ఆయనకు తెలీదా అని ప్రశ్నించారు. ఈ విషయాలేవీ తెలియకుండా ఆయన ఆ మాటలు ఆడడంతో ఆయన విజ్ఞానం ఎంతపాటిదో నియోజకవర్గ ప్రజలకు ఇట్టే అర్థమైపోయిందన్నారు. ఇలాంటి తప్పుడు ఆరోపణలు, ప్రచారాలు చేసిన వారికి ఓటర్లే తగిన బుద్ధి చెబుతారని, ఈసారి ఆయన ఓటమి ఖాయమన్నారు. కార్యక్రమంలో ఎన్నికల పరిశీలకుడు మావుడి శ్రీనివాసనాయుడు, వైఎస్సార్ సీపీ ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు తూముల రామసుధీర్, బాడంగి జెడ్పీటీసీ పెద్దింటి రామారావు తదితరులు పాల్గొన్నారు.



పూర్తయిన కందులపదం వంతెన

సాలూరులో.. సంక్షేమ సంతకం

దట్టమైన అటవీ ప్రాంతాల గుండా అద్దంలా మెరిసే తారురోడ్లు.. ప్రతీ గూడకు చేరువైన సంక్షేమ, అభివృద్ధి పాలన, ఇంటింటా 'నవరత్న'వికాసం.. తీరిన సిగ్నల్స్ సమస్యలు.. అందుబాటులోకి వచ్చిన విద్య, వైద్య సదుపాయాలు.. పేద, మధ్య తరగతి కుటుంబాల పిల్లలకు చేరువైన కార్పొరేట్ స్థాయి ప్రభుత్వ విద్య, సచివాలయ వ్యవస్థతో ఊరిలోనే అందుతున్న ప్రభుత్వ సేవలు.. తీరిన వంతెన వెతలు.. ఇలా ప్రతి ఊరు/వార్డులో కేవలం 58 నెలల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో సంక్షేమ, అభివృద్ధి పాలన సాక్షాత్కరిస్తోంది. ఇంటింటా సంక్షేమ సంతకం కనిపిస్తోంది.

- గిరిశిఖర గ్రామాలకు 'మార్గం' సుగమం
- ఇంటింటా 'నవరత్న' వికాసం
- వివిధ సంక్షేమ పథకాల కింద 8,14,539 మందికి రూ.1,628 కోట్ల ఆర్థిక ప్రయోజనం
- రూ.1300 కోట్లతో అభివృద్ధి పనులు

సాలూరు:


మంచి ఆలోచన కలిగిన నాయకుడు పాలకుడైతే ఏ స్థాయిలో అభివృద్ధి జరుగుతుందనేందుకు సాలూరు నియోజకవర్గమే నిలువెత్తు సాక్ష్యం. గిరిజనుల కష్టసుఖాలు తెలిసిన వ్యక్తి కావడం, ఈ ప్రాంతంలోని సమస్యలు, చేకూర్చాల్సిన సదుపాయాలు, ప్రతి ఊరు, వార్డుపైన స్పష్టమైన అవగాహన, చక్కని విజన్ ఉన్న నాయకుడు పాలన సాగించడంతో కేవలం 58 నెలల్లోనే నియోజకవర్గం ప్రగతి పట్టాలెక్కింది. 14 ఏళ్లపాటు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబునాయుడు ఏ రోజు సాలూరు నియోజకవర్గం గురించి పట్టించుకోలేదు. ఇక్కడి గిరిజన సమస్యలపై కనీసం స్పందించలేదు. సంక్షేమ పథకాలు కావాలంటే జన్మభూమి కమిటీల కాళ్లుపట్టుకోవాల్సిన దుస్థితి. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గిరిజన గూడల్లో విద్యా చైతన్యం వెల్లివిరుస్తోంది. ప్రతీ గ్రామానికి రోడ్డు సదుపాయాలు కలిగాయి. వైద్యసేవలు అక్కరకు వచ్చాయి. సొంతింటి భాగ్యం సమకూరింది. రిజర్వాయర్ల ఆధునికీకరణతో సాగునీటి వెతలు తీరాయి. చినుకుపడితే ఉగ్రరూపం దాల్చే వాగులపై వంతెన నిర్మాణాలు పూర్తయ్యాయి. పట్టణ ప్రజలకు ట్రాఫికష్టాలు తీర్చేలా బైపాస్‌రోడ్డు నిర్మితమైంది. గిరిజన వర్సిటీ గిరిజనుల చెంతకే వచ్చింది. రైతులకు డా.వైఎస్సార్ అగ్రిల్యాబ్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. నాడు–నేడు నిధులతో ప్రభుత్వ బడులకు ఆధునిక సొబగులు అద్దుకున్నాయి. సచివాలయాలు, ఆర్‌బీకేలు, వెల్‌నెస్ సెంటర్లు, డిజిటల్ లైబ్రరీల ఏర్పాటుతో ప్రతి ఊరూ కొత్తరూపును సంతరించుకుంది. సాలూరులో సంక్షేమ వికాసం స్పష్టంగా కనిపిస్తోంది.

ప్రతి ఇంటా ఆర్థిక వికాసం..

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సాలూరు నియోజకవర్గంలో సుమారు 8,14,539 మంది లబ్ధిదారులకు వివిధ పథకాల కింద 1,628 కోట్ల ఆర్థిక ప్రయోజనం చేకూరింది. రూ.1300 కోట్ల వ్యయంతో ప్రభుత్వ భవనాలు, వంతెనలు, సీసీ రోడ్లు, బీటీ రోడ్లు తదితర 15,857 అభివృద్ధి పనులు చేపట్టారు. వీటిలో ఇప్పటికే సుమారు 7వేల పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులు వివిధ దశల్లో ఉన్నాయి.

ప్రజలకు ఆరోగ్య భరోసా..

ప్రజల ఆరోగ్యానికి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిచ్చింది. ధనవంతులకే పరిమితమైన ఫ్యామిలీ డాక్టర్ సేవలను పేద ప్రజలకు చేరువ చేసింది. ఆస్పత్రుల్లో వైద్యులు, సిబ్బందిని పూర్తిస్థాయిలో నియమించింది. ఊరూరా జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేసింది. ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించేందుకు వీలుగా సాలూరు ఏరియా ఆస్పత్రిని వంద పడకలకు స్థాయి పెంచింది. రూ.17కోట్ల నాబార్డు నిధులతో ఆస్పత్రికి కావాల్సిన సదుపాయాలు సమకూర్చుతోంది. గత టీడీపీ ప్రభుత్వం ఆస్పత్రికి టెంకాయ కొట్టి పనులను విస్మరించిన విషయాన్ని స్థానికులు గుర్తుచేస్తున్నారు.



నిర్మాణం పూర్తయిన ఎన్‌హెచ్-26 నుంచి కరదావలస రోడ్డు



నిర్మాణం పూర్తయిన శిఖపరువు రోడ్డు



నిర్మాణం పూర్తయిన రొడ్డవలస రోడ్డు



అభివృద్ధి పథం సంక్షేమ రథం



తుది దశకు చేరుకున్న వంద పడకల ఆస్పత్రి భవనం

వంతెన నిర్మాణాలు ఇలా..

గిరిజన ప్రాంతంలో ఐటీడీఏ, పీఆర్ ప్రాజెక్టు, ఆర్‌అండ్‌బీ తదితర శాఖల ఆధ్వర్యంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వంతెన నిర్మాణాలు చేపట్టింది.

- సాలూరు మండలంలో కందులపదం వద్ద గోముఖి నదిపై వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ. 5.13 కోట్ల ఖర్చుతో ఆర్‌అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో వంతెన నిర్మాణాన్ని పూర్తిచేసింది. దీంతో సుమారు 50 గ్రామాల ప్రజలకు రాకపోకల కష్టాలు తొలగాయి.
- పాచిపెంట మండలంలో మోసూరు వంతెనను రూ.8 కోట్లతో పూర్తిచేసింది.
- సుమారు కోటి రుపాయలతో పాచిపెంట మండలం పద్మాపురం నుంచి ఈతమానువలస మధ్యలోని వాగుపై బ్రిడ్జి నిర్మాణం సాగుతోంది.
- సుమారు కోటి ఖర్చుతో తలపెట్టిన కొండమోసూరు–దొరలుద్దండి మధ్య బ్రిడ్జి పనులు చివరిదశలో ఉన్నాయి.
- సాలూరు మండలం తుండ ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి మక్కువ వెళ్లే రోడ్డులో బట్టివలస వద్ద సుమారు రూ.కోటి ఖర్చుతో వంతెన నిర్మాణం తలపెట్టింది. • నంద–తుండ ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి సీబిలి మధ్యలో రూ.కోటి వ్యయంతో నిర్మిస్తున్న బ్రిడ్జి శ్లాబ్ లెవెల్‌లో ఉంది.
- సొంపిగాం, కురుకూటి, ఆలూరు–మోదుగ మధ్య, గుంటబద్ర ,లింగాడవలస బ్రిడ్జిలు, నేరెళ్లవలస, వెలగవలస –ములక్కాయవలస బ్రిడ్జి పనులకు అధికారులు చర్యలు చేపట్టారు.



కొత్తవలసలో నిర్మించిన సచివాలయం

సొంతింటి కల సాకారం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పట్టణం, మండలాల్లోని వేలాదిమంది పేదలకు సొంతింటి కలను సాకారం చేసింది. ఉచితంగా స్థలాలు ఇవ్వడంతో పాటు నిర్మాణానికి రూ.1.80లక్షల చొప్పున బిల్లులు చెల్లిస్తోంది. సాలూరు పట్టణంలో రూ.82.85 కోట్లతో టిడ్కో ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేసి ఒక్క రూపాయికే 1056 మంది లబ్ధిదారులకు అప్పగించింది. కోట్లాది రూపాయలతో మౌలిక సదుపాయాలు కల్పించింది.

ప్రాజెక్టుల ఆధునికీకరణ

దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి హయాంలో 2006లో పాచిపెంట మండల కేంద్రంలో పెద్దగెడ్డ రిజర్వాయర్ నిర్మించారు. వెంగళరాయ సాగర్, ఆంధ్ర రిజర్వాయర్లు కూడా సాలూరు నియోజకవర్గంలోనే ఉన్నాయి. వీటిని కోట్లాది రూపాయలతో ఆధునీకరించి రైతుల సాగునీటి కష్టాలు తీర్చడంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సఫలమైంది. మరోవైపు గిరిజన రైతులు సాగుచేసే భూములకు శాశ్వత హక్కులు కల్పిస్తూ పట్టాలు పంపిణీ చేసింది.

వివిధ సంక్షేమ పథకాల కింద సాలూరు నియోజకవర్గంలోని లబ్ధిదారులకు కలిగిన లబ్ధి ఇలా...

పథకం	లబ్ధిదారుల సంఖ్య	లబ్ధి (రూపాయల్లో)
జగనన్న అమ్మ ఒడి	29,779	124,99,60,292
వైఎస్సార్ రైతు భరోసా	38,836	174,58,13,700
వైఎస్సార్ ఫించన్ కానుక	43,426	413,21,24,250
వైఎస్సార్ చేయూత	20,284	91,95,47,750
వైఎస్సార్ ఆసరా	45,887	62,25,44,274
జగనన్న వసతిదీవెన	12,917	13,94,84,865
జగనన్న విద్యాదీవెన	15,837	28,73,28,507
డా.వైఎస్సార్ ఫ్రీ క్రాప్ ఇన్సూరెన్స్	2,739	18,40,76,561
వైఎస్సార్‌సున్నావడ్డీ పంట రుణాలు	7,112	1,81,04,006
కాపు నేస్తం	626	2,16,00,000
జగనన్న చేదోడు	2,227	5,05,00,000
వైఎస్సార్ వాహనమిత్ర	1319	3,72,60,000
డా.వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	10,257	32,52,02,978
వైఎస్సార్ ఈబీసీ నేస్తం	676	1,71,00,000

వివిధ విభాగాల ఆధ్వర్యంలో జరిగిన అభివృద్ధి పనులు ఇలా...

డిపార్ట్‌మెంట్ /పని పేరు	మంజూరైన పనులు	అంచనా వ్యయం (రూ.కోట్లల్లో)
పంచాయతీ రాజ్ (పీఆర్ఐ)	2,720	87.10
పంచాయతీ రాజ్ (పీఐయూ)	51	183.67
ఆర్అండ్‌బీ	55	152.50
ట్రైబల్ వెల్ఫేర్	536	183.37
ఇరిగేషన్	54	113.95
ఆర్‌డబ్ల్యూఎస్	796	152.41
నాడు నేడు (హాస్పిటల్స్), వంద పడకల ఆస్పత్రి	7	28.37
ఏపీటిడ్కో ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్	5	90.52
మున్సిపల్ ఇంజినీరింగ్	333	24.05
ఏపీఈపీడీసీఎల్	460	16.74
హౌసింగ్	10,837	195.07


రాళ్ల దారుల్లో రాచబాటలు

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తొలిసారిగా గిరిశిఖర గ్రామాలకు బీటీ రోడ్లు నిర్మాణాలు ఈ ఐదేళ్లలోనే సాగాయి. ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో అటవీశాఖ అనుమతులు తెచ్చి రాళ్లదారులను రాచబాటలుగా మార్చింది. గిరిజన ప్రజలకు రాకపోకల కష్టాలు తొలగించింది. – ఎన్‌హెచ్–26 నుంచి కరదావలసకు రూ.4.96కోట్లతో 7.30 కి.మీ రోడ్డు నిర్మించింది.

- సాలూరు మండలం గంజాయిభద్ర పంచాయతీ దిగువశెంబి నుంచి డిప్పలపాడు మీదుగా తోణాంకు రూ.6.20 కోట్లతో 6 కి.మీ. మేర రోడ్డుపనులకు నిధులు మంజూరయ్యాయి.
- పాచిపెంట మండలంలోని ఆజూరు నుంచి పందిరిమామిడివలసకు సుమారు రూ.2.24కోట్లతో 3.80 కి.మీ.రోడ్డు నిర్మాణం పూర్తయింది.
- పాచిపెంట మండలంలోని కుంతాం బీటీ రోడ్డు నుంచి తుమ్మిగుడ్డకు రూ.4.65కోట్లతో 6.90 కి.మీ రోడ్డును ప్రభుత్వం నిర్మించింది.
- పాచిపెంట మండలం నీలంవలస నుంచి గుమ్మిడిగూడకు రూ.3.76కోట్లతో 6.80 కి.మీ రోడ్డు నిర్మాణాన్ని జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పూర్తిచేసింది.
- వేటగాని వలస నుంచి శతాబి మీదుగా అరకుకు రూ.9.97కోట్లతో తలపెట్టిన 14 కి.మీ రోడ్డులో 8 కి.మీ బీటీ రోడ్డు నిర్మాణాన్ని పూర్తిచేసింది.
- రూ.6.28 కోట్లతో వేటగానివలస నుంచి తంగ్లాంకు రోడ్డు పనులు జరుగుతున్నాయి.
- రొడ్డవలస నుంచి కంకణాపల్లికు రూ.1.35కోట్లతో 1.20 కి.మీ రోడ్డు నిర్మాణ దశలో ఉంది.
- రూ.4.03కోట్ల అంచనా వ్యయంతో పాచిపెంట మండలం ఆలూరు నుంచి మోదుగ రోడ్డు పనులు చురుగ్గా సాగుతున్నాయి.
- సాలూరు మండలం నంద–పగులుచెన్నేరు నుంచి కొదమకు సుమారు రూ.11.32కోట్లతో 10.80 కి.మీ రోడ్డు పనులు చివరిదశకు చేరాయి.




సాలూరులో నిర్మాణం పూర్తయిన టిడ్కో ఇళ్లు



ఆధునికీకరణ పనులు జరుగుతున్న పెద్దగెడ్డ రిజర్వాయర్



అటవీమార్గం గుండా వేసిన గిరిశిఖర కరదావలస రోడ్డు



గిరిశిఖర కరదావలస గ్రామంలో నిర్మించిన రచ్చబండ

సీఎం జగన్‌తోనే అభివృద్ధి, సంక్షేమం

- వైఎస్సార్ సీపీ రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

వంగర: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి, ప్రజాసంక్షేమం సాధ్యమని, రానున్న ఎన్నికల్లోనూ మనమంతా ఆయనకు అండగా నిలవాలని వైఎస్సార్ సీపీ రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ కోరారు. మండలంలోని మద్దివలస, ఎం.సీతారాంపురం, శివ్వాం గ్రామాల్లో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించిన వారికి ఆయా గ్రామాల ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన వారు..ఈ ఐదేళ్లలో ప్రజలకు ప్రభుత్వం చేసిన మంచిని వివరించారు. రాష్ట్ర అభివృద్ధితో పాటు రాష్ట్రంలోని అన్నివర్గాల సంక్షేమం కోరుతూ అనేకానేక పథకాలను ప్రభుత్వం అమలు చేసిందన్నారు. పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయన్నారు. మనమంతా బాగుండాలంటే మళ్లీ వైఎస్సార్ సీపీనే అధికారంలోకి తీసుకురావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఇవే పథకాలు కొనసాగాలంటే సీఎం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. ఈ నెల 13వ తేదీన జరిగే ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి, వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, పార్టీ మండల కన్వీనర్ కరణం సుదర్శనరావు, మండల జేసీఎస్ కన్వీనర్ కిమిడి ఉమామహేశ్వరరావు, పీఏసీఎస్ అధ్యక్షురాలు మరిచర్ల విజయలక్ష్మి గంగారావు, సర్పంచ్‌లు గణేష్‌బెనర్జీ, కళావతి, వెంకటప్పలనాయుడు, సత్యంనాయుడు పాల్గొన్నారు.



వంగర: మద్దివలసలో ఎన్నికల ప్రచారంలో ప్రభుత్వం చేసిన మంచిని వివరిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, పక్కనే ఎమ్మెల్యే అభ్యర్థి తలే రాజేష్

ముగిసిన రాష్ట్రస్థాయి పెన్‌కాక్ సిలాట్ పోటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళంలో జరిగిన 9వ ఏపీ రాష్ట్రస్థాయి పెన్‌కాక్ సిలాట్(మార్షల్ ఆర్ట్స్) క్రీడా పోటీలు ముగిశాయి. శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని ఢిల్లీ ఇంటర్నేషనల్ పబ్లిక్ స్కూల్ వేదికగా ఈనెల 5,6 తేదీల్లో జరిగిన ఈ పోటీలు సోమవారంతో ముగిశాయి. ఈ పోటీలకు రాష్ట్ర నలుమూలల నుంచి 350 మంది బాలబాలికలు ప్రాతినిధ్యం వహించారు. విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు బహుమతులను అందజేశారు. డీపీఎస్ డైరెక్టర్ ముద్దాడ సత్యప్రసాద్, ఎస్ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ సూర శ్రీనివాసరావు విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్షల్ ఆర్ట్స్ క్రీడలతో శారీరక దారుఢ్యం, మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో టోర్నమెంట్ చీఫ్, గ్రాండ్ మాస్టర్ రేగిడి దయామయ, పెన్‌కాక్ సిలాట్ జిల్లా ప్రధాన కార్యదర్శి నక్క లక్ష్మణనాయుడు, సౌత్‌జోన్ సెక్రటరీ టి.మనోజ్‌సాయి, రాష్ట్ర కార్యదర్శి విజయభరద్వాజ్, రిఫరీలు ఎం.వెంకటరావు, వంశీకృష్ణ, ఎల్.ఈశ్వరరావు, హేమంత్‌కుమార్, ఎం.గౌతమి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు. డీపీఎస్ పాఠశాలలోనే క్రీడాకారులకు వసతి, భోజన ఏర్పాట్లు కల్పించారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం